సాక్షి పల్నాడు
శనివారం । 25 । మార్చి । 2023



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన సూరిపెద్ది వెంకట కనకదుర్గా వరప్రసాద్ శుక్రవారం రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు.



రంజాన్ మాసం ప్రారంభం

పాతగుంటూరు: పవిత్ర రంజాన్ మాస ఉపవాస దీక్షలు (రోజా) శుక్రవారం ప్రారంభమయ్యాయి. గురువారం సాయంత్రం ఆకాశాన నెలవంక దర్శనం కావడంతో దువా చేసి దీక్షలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
గుంటూరు	6:25	4:52
నరసరావుపేట	6:27	4:49
బాపట్ల	6:25	4:52

న్యూస్‌రీల్

ఐదుగురు విద్యార్థులపై మాల్ ప్రాక్టీసు కేసులు

107 ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో విస్తృత తనిఖీలు

గుంటూరు ఎడ్యుకేషన్: సీనియర్ ఇంటర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీసుకు పాల్పడిన ఐదుగురు విద్యార్థులపై కేసులు నమోదయ్యాయి. శుక్రవారం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మ్యాథ్స్ పేపర్-2బీ, జువాలజీ, హిస్టరీ పేపర్-2 పరీక్షలు జరిగాయి. గుంటూరు గోరంట్లలోని శ్రీచైతన్య జూనియర్ పరీక్షా కేంద్రంలో ముగ్గురు విద్యార్థులతో పాటు చిలకలూరిపేటలోని ఏఎంజీ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో కాపీయింగ్‌కు పాల్పడిన ఒక విద్యార్థిని గుర్తించిన అధికారులు మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు చేశారు. గుంటూరు నవభారత్‌నగర్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని డీఈఈవో జె.పద్మ ఆకస్మికంగా తనిఖీ చేసిన సమయంలో ఒక విద్యార్థి స్లిప్పులను కలిగిఉండటాన్ని గుర్తించారు. దీంతో సదరు విద్యార్థిపై మాల్ ప్రాక్టీసు కేసు నమోదుతో పాటు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇన్విజిలేటర్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చారు. శుక్రవారం జరిగిన పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 134 కేంద్రాల పరిధిలో కేటాయించిన 40,764 మంది విద్యార్థుల్లో 39,839 మంది హాజరయ్యారు. అత్యధికంగా 107 పరీక్షా కేంద్రాల్లో వివిధ శాఖల అధికారులతో పాటు పరిశీలకులు, స్క్వాడ్స్ విస్తృత తనిఖీలు నిర్వహించారు.

యార్డులో 87,530 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 81,449 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 87,530 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.27,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,200 నుంచి రూ.13,000 వరకు ధర దక్కింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 79,416 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

పీఏసీఎస్ సీఈఓ సస్పెన్షన్

నిజాంపట్నం: నిజాంపట్నం పీఏసీఎస్ సీఈవోగా పనిచేస్తున్న మోపిదేవి నాగేశ్వరరావు అవకతవకలకు పాల్పడినందున 6 నెలల పాటు విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు పీఏసీఎస్ చైర్మన్ మరకా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం నిజాంపట్నంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 2021–22 సంవత్సరానికి సంబంధించి ఇన్‌కంట్యాక్స్ రిటర్న్‌ను పంపకపోవడం, 2018–19 నుంచి ఐటీ రిటర్న్‌ను సంఘం పేరున ఉన్న పాన్‌కార్డుపై కాకుండా సంఘ అధ్యక్షుడి పాన్‌కార్డు ద్వారా పంపడం, సంఘ సభ్యులు కొంత మందివి పాస్‌బుక్‌లు పోగొట్టడం వంటి పలు అవకతవకలపై చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

కనకదుర్గ నగర్‌లో మరో పొంగలి షెడ్డు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భక్తుల సౌకర్యార్థం కనకదుర్గనగర్‌లో మరో పొంగలి షెడ్డు ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నట్లు దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు. దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద ఏర్పాటు చేసిన పొంగలి షెడ్డును చైర్మన్ రాంబాబు శుక్రవారం ప్రారంభించారు. తొలుత స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం పొంగలి షెడ్డులో చైర్మన్ దంపతులు, పాలక మండలి సభ్యులు అడుగు పెట్టారు. పొయ్యిలకు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం చైర్మన్ రాంబాబు దంపతులు పొంగలి వండి అమ్మవారికి నివేదన సమర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ఘాట్‌రోడ్డులోని పొంగలి షెడ్డులో 20 పొయ్యిలను ఏర్పాటు చేశామన్నారు. కనకదుర్గనగర్‌లో మరో పొంగలి షెడ్డు ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, కట్టా సత్తెయ్య, బచ్చు మాధవీకృష్ణ, కొలుకులూరి రామసీత, కేసరి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అతివకు ఆసరా

- నేడు మూడో విడత వైఎస్సార్ ఆసరా చెల్లింపు
- రెండు దఫాలుగా 25,175 డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.382.53 కోట్లు జమ
- నేడు మరో రూ.190.99 కోట్లు విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- రేపటి నుంచి పది రోజుల పాటు ప్రతి మండలంలో ఆసరా సంబరాలు
- మహిళల సంక్షేమం కోసమే ఆసరా అంటున్న జిల్లా కలెక్టర్ శివశంకర్



సాక్షి, నరసరావుపేట: తన సుదీర్ఘ పాదయాత్రలో భాగంగా డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు రుణమాఫీ చేస్తానన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ మేరకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టారు. గత సార్వత్రిక ఎన్నికలు (11–04–2019) నాటికి వారి సంఘాలకు బ్యాంకుల్లో ఉన్న రుణాన్ని నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని మాట ఇచ్చారు. అందులో భాగంగా మూడో విడత చెల్లింపులు నేడు ప్రారంభం కానున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరు జిల్లా దెందులూరులో నగదు జమను ప్రారంభించనున్నారు. పల్నాడు కలెక్టరేట్‌లో జరిగే కార్యక్రమంలో జిల్లా ప్రజాప్రతినిధులు, కలెక్టర్, జేసీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. ఇప్పటికే సెప్టెంబర్ 11, 2020న తొలి విడతలో భాగంగా 25,034 సంఘాలకు రూ.190.21 కోట్ల చెల్లింపులు పూర్తి చేశారు. రెండో విడతలో భాగంగా అక్టోబర్ 7, 2021న 25,175 సంఘాల్లోని మహిళలకు రూ.192.32 కోట్లు జమ చేసింది. ఇప్పటి వరకు మొత్తం రెండు విడతల్లో పల్నాడులోని అక్కచెల్లెమ్మల ఖాతాల్లో రూ.382.53 కోట్లు జమైంది. జిల్లాలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారుల జాబితాలు ప్రదర్శించి, అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

ఏప్రిల్ 5 వరకు ఆసరా ఉత్సవాలు..

మహిళల సంక్షేమం కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఆసరా పథకం మూడో విడత చెల్లింపుల కార్యక్రమం నియోజకవర్గాల వారీగా ప్రతి మండలంలో ఈ నెల 26వ తేదీ నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందులో ఎమ్మెల్యేలు, ఎంపీలు మొదలు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ, వార్డు సచివాలయాల్లో అధికారులు మహిళలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పది రోజులపాటు పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాలు జరగనున్నాయి.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఆసరా మూడో విడత చెల్లింపుల వివరాలు

నియోజకవర్గం	ఆసరా నగదు జమ కానున్న డ్వాక్రా గ్రూపుల సంఖ్య	జమ కానున్న నగదు (రూ.కోట్లలో)
నరసరావుపేట	2,645	20.82
పెదకూరపాడు	4,031	31.13
సత్తెనపల్లి	3,875	32.19
చిలకలూరిపేట	3,279	26.40
గురజాల	3,459	21.70
మాచర్ల	4,080	32.63
వినుకొండ	3,799	26.12
మొత్తం	25,168	190.99

మహిళలకు జీవనోపాధులు..

వైఎస్సార్ ఆసరా ద్వారా జమవుతున్న నగదును ఉత్సాహం ఉన్న డ్వాక్రా మహిళలు జీవనోపాధులైన పాడి పరిశ్రమ, రిటైల్ అమ్మకాలు, ఇతర ఉత్పత్తుల ద్వారా నెలనెలా ఆదాయం పొందేలా ప్రభుత్వం సహకరించనుంది. ఇందుకోసం అమూల్, హిందుస్థాన్ యూనిలీవర్, ప్రోక్టర్ అండ్ గ్యాంబల్ వంటి బహుళ జాతి సంస్థలతో ఒప్పందం చేసుకుంది. మహిళలు వారికి అనువుగా ఉన్న జీవనోపాధిని ఎంచుకోవచ్చు. ఆయా కంపెనీలు మహిళలకు అవసరమైన శిక్షణ ఇచ్చి జీవనోపాధి ఏర్పాటుకు సహకరిస్తాయి. ఇప్పటికే పల్నాడు జిల్లాలో వెయ్యి మందికిపైగా జీవనోపాధులు కల్పించారు.

మూడు విడతల్లో పల్నాడు జిల్లాలో డ్వాక్రా మహిళలకు ఆసరా లబ్ధి

విడత	ఆసరా చెల్లింపు లబ్ధి పొందిన గ్రూపుల సంఖ్య	లబ్ధి పొందిన నగదు (రూ.కోట్లలో)
మొదటి	25,034	190.21
రెండో	25,175	192.32
మూడో	25,168	190.99
మొత్తం		573.52

నాకు రూ.66,166 రుణమాఫీ లబ్ధి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీలన్నింటిని తేదీలు ప్రకటించి మరీ అమలు చేస్తున్నారు. ఆయన మాట ఇచ్చారంటే అది అమలైనట్టే అన్న నమ్మకం ప్రజల్లో కలుగుతోంది. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాకు రూ.66,166 రుణమాఫీ జరిగింది. ఇప్పటికే రెండు విడతల్లో రూ.32,082 నా ఖాతాలో జమైంది. ఈ డబ్బులతో ఇస్త్రీ పెట్టె, బండి తీసుకొని ఇస్త్రీ చేస్తూ జీవనం సాగిస్తున్నాను.

– సంగం పార్వతి, రాజుపాలెం గ్రామం

నెలకు రూ.10 వేలు సంపాదిస్తున్నా..



ప్రభుత్వం డ్వాక్రా రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేసి ఆ సొమ్మును పొదుపు ఖాతాల్లో జమ చేయడం వల్ల మహిళలు ఆర్థికంగా బలపడతారు. ప్రభుత్వం ఇచ్చిన డబ్బుతో పాటు రూ.50 వేల రుణం తీసుకొని పచ్చళ్ల తయారీ యూనిట్ ప్రారంభించాను. దీంతో ఎవరిపైనా ఆధారపడకుండా నెలకు రూ.10 వేల వరకు సంపాదిస్తున్నాను. అక్కచెల్లెమ్మలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు.

– సందేపోగు పవిత్ర, పసుమర్రు, చిలకలూరిపేట మండలం

మహిళల సంక్షేమం కోసమే ఆసరా



నవరత్నాలలో భాగమైన వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత చెల్లింపులు శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానుంది. ఆసరా సొమ్మును మహిళలు నచ్చిన విధంగా వినియోగించుకొనే వెసులుబాటు ఉంది. ఉత్సాహం ఉన్న మహిళలకు జీవనోపాధులు కల్పించేందుకు ప్రభుత్వం తోడ్పాటునందిస్తోంది. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. వాటిని మహిళలు వినియోగించుకొని స్వయం సమృద్ధి సాధించాలి.

– శివశంకర్ లోతేటి, జిల్లా కలెక్టర్, పల్నాడు

జైళ్ల శాఖలో 30 శాతం ఖాళీల భర్తీకి ప్రతిపాదనలు

- రాష్ట్ర వ్యాప్తంగా 28 పెట్రోల్ బంకులు ఏర్పాటు
- జైళ్ల శాఖ ఐజీ హసన్ రిజా



సత్తెనపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా జైళ్ల శాఖలో 30 శాతం ఖాళీలు ఉన్నాయని, వాటి భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని జైళ్ల శాఖ డీజీ హసన్ రిజా తెలిపారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి సబ్‌జైలులో జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జైళ్ల శాఖ ఆధ్వర్యంలో 28 పెట్రోల్ బంకులు ఏర్పాటు చేశామని, వీటిలో 16 పూర్తి కాగా 12 వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. ఓపెన్ ప్రిజనర్ కింద పెట్రోల్ బంకుల్లో పనిచేసేందుకు ఐదేళ్ల పైబడి శిక్ష అనుభవిస్తున్న సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను తీసుకుంటున్నామన్నారు. జైళ్లలో ఖైదీలకు ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తున్నామని చెప్పారు. రాజమండ్రి సబ్‌జైల్లో కూరగాయలు సాగు చేపట్టడంతో రూ.30 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు. జైళ్లలో అనేక సంస్కరణలు అమలవుతున్నాయన్నారు. సత్తెనపల్లి సబ్ జైలులో రూ.9 లక్షలతో టాయిలెట్ల నిర్మాణం జరుగుతోందన్నారు. సబ్‌జైల్లో తనిఖీలు చేసి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఐజీ వరప్రసాద్, గుంటూరు జైళ్ల శాఖ అధికారి వీరేంద్రప్రసాద్, సత్తెనపల్లి సబ్‌జైలు సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఉన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 533.00 అడుగుల వద్ద ఉంది. ఇది 174.0610 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 9,047, ఎడమకాలువకు 7,684, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 11,827, ఎస్ఎల్‌బీసీకి 2,000, వరదకాలువకి 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 30,878 క్యూసెక్కులు విడుదలవుతోంది.

క్షయ నివారణకు సహకరించాలి

- డీఆర్వో కె.వినాయకం
- పట్టణంలో ప్రపంచ క్షయవ్యాధి నివారణ అవగాహన ర్యాలీ



క్షయ నివారణ అవగాహన ర్యాలీని పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న డీఆర్వో వినాయకం, డాక్టర్ పద్మావతి

నరసరావుపేట: క్షయ వ్యాధిగ్రస్తులు ప్రభుత్వం అందజేసే మందులు, పౌష్టికాహారం తీసుకొని వ్యాధి నివారణకు సహకరించాలని డీఆర్వో కె.వినాయకం, జిల్లా క్షయ, కుష్ఠు, ఎయిడ్స్ రోగ నివారణ జిల్లా అధికారి డాక్టర్ కె.పద్మావతి కోరారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పల్నాడు జిల్లా క్షయ నియంత్రణ కార్యాలయం ఆధ్వర్యంలో పల్నాడు రోడ్డు పాత ప్రభుత్వాసుపత్రి నుంచి ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని డీఆర్వో వినాయకం పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి ప్రమాదకరమైనదైనా పూర్తి చికిత్స ఉందన్నారు. దీనికి కావాల్సిన మందులు, పౌష్టికాహారాన్ని ప్రభుత్వం ఉచితంగా ఇస్తోందన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆర్‌టీపీసీఆర్, సీబీనాట్ మిషన్లు, డీఎంసీలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఎవరికైనా సరే రెండు వారాల నుంచి దగ్గు, జలుబు, కళ్లెలో రక్తం పడటం, చాతీలో అసౌకర్యం, బరువు తగ్గటం వంటి లక్షణాల్లో ఏ ఒక్క లక్షణం ఉన్నా సరే సమీపంలోని పీహెచ్‌సీకి వెళ్లి కళ్లె పరీక్ష చేయించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ప్రతి నెల ఆర్థిక సహాయం కింద రూ.500 అందజేస్తోందన్నారు. దీంతో పాటు ప్రధానమంత్రి టీబీ ముక్త భారత అభియాన్ ప్రోగ్రామ్ కింద జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలోని 1234 మంది దాతలను గుర్తించి 1781 మంది టీబీ పేషెంట్లను దత్తత తీసుకొని ప్రతి నెలా వారికి నిక్షయ మిత్ర ప్రోగ్రామ్ ద్వారా 1200 మందికి ఫుడ్ బాస్కెట్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. క్షయ వ్యాధి సోకిన వారెవరూ భయపడకుండా వెంటనే చికిత్స మొదలు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి, ప్రభుత్వ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పారిశుద్ధ్యంపై ఆరా

వీడియా కాన్ఫరెన్స్‌లో కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ ఎల్.శివశంకర్

నరసరావుపేట: పల్నాడు జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పారిశుద్ధ్యం ఎలా ఉందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులను ఆరా తీశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పలు మండల కేంద్రాల్లోని ప్రభుత్వ వసతి గృహాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో రాత్రి బస చేశారు. దీనిపై శుక్రవారం ఉదయాన్నే కలెక్టర్ చేపట్టిన గ్రామోదయం కార్యక్రమం ద్వారా మండల అధికారుల కమిటీ ట్రాన్సెక్ట్ వాక్ పేరుతో పలు ప్రాంతాల్లో పర్యటించారు. అధికారుల పర్యటనలో అక్కడ ఉన్న పరిస్థితులు, గుర్తించిన సమస్యలు, వాటికి చూపిన పరిష్కార మార్గాలు తదితర అంశాలపై శుక్రవారం సాయంత్రం కలెక్టర్ ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో బడి నిద్ర కార్యక్రమంలో సందర్శించిన పాఠశాలల్లో నాడు–నేడు పథకం ద్వారా జరుగుతున్న పనుల పెండింగ్ అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు ఏఏ మండలాల్లో పర్యటించారు. అక్కడ గుర్తించిన సమస్యలు, వాటి పరిష్కార మార్గాలను అడిగి తెలుసుకున్నారు. బడుల్లో రక్తహీనత సమస్యతో బాధపడుతున్న పిల్లలు ఎంతమంది ఉన్నారు. వారికి అధికారులు అందించిన సూచనలు, సలహాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ బడుల్లో తాగునీటి సమస్యను గుర్తించారా? వాటి పరిష్కార మార్గాలు చూపిన విధానాలను జిల్లా కలెక్టర్ కనుక్కొన్నారు. ప్రజలకు ఆధార్ అప్‌డేషన్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించి ఓటర్ కార్డును ఆధార్ కార్డుకు అనుసంధానం చేయాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, సర్వశిక్ష అభియాన్ అధికారులు, ఆయా సంక్షేమ శాఖల వసతి గృహాధికారులు, స్పెషల్ ఆఫీసర్స్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిత్రులను మింగేసిన మృత్యువు

- చెరువులో ఈతకు దిగిన ఇద్దరు స్నేహితులు దుర్మరణం
- గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది సాయంతో మృతదేహాల వెలికితీత
- ప్రత్తిపాడులో విషాదం



ప్రసన్నకుమార్ (ఫైల్)



నాగుల్‌మీరా (ఫైల్)

ప్రత్తిపాడు: సరదాగా చెరువు గట్టున సేదతీరుతూ కాలక్షేపం చేద్దామనుకున్న ఆ ఇద్దరు స్నేహితులను మృత్యువు వెంటాడింది. ఈత కొట్టేందుకు చెరువులోకి దిగిన ఇద్దరు మిత్రులను మృత్యువు కబళించిన విషాద ఘటన ప్రత్తిపాడులో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రత్తిపాడుకు చెందిన చీలి ప్రసన్నకుమార్ (25), షేక్ నాగుల్ మీరా (22) స్నేహితులు. ఇద్దరూ శుక్రవారం ఉదయం స్థానిక రక్షిత మంచినీటి చెరువులో ఈతకు దిగారు. కొద్ది క్షణాలకే చెరువులో కూరుకుపోయి మునిగిపోయారు. అదే సమయంలో అటువైపుగా పొలానికి వెళుతున్న ఎం.పూర్ణచంద్రరావు వారిని గమనించి విషయాన్ని ప్రసన్నకుమార్ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రకుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. స్థానిక ఈతగాళ్లను చెరువులోకి దింపి గాలించారు. ఫలితం లేకపోవడంతో ఫైర్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలకు సమాచారమిచ్చారు. సుమారు మూడు గంటల పాటు శ్రమించి గజ ఈతగాళ్ల సాయంతో ఫైర్ సిబ్బంది, పోలీసులు మృతదేహాలను బయటకు తీశారు. ఈ మేరకు మృతుల కుటుంబీకులు షేక్ మున్ని, సీహెచ్ శివకుమారి ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గర్భిణికి పుట్టెడు శోకం..

భర్త దుర్మరణం భార్యకు పుట్టెడు శోకాన్ని మిగిల్చింది. మృతుడు ప్రసన్నకుమార్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి కొన్నేళ్ల కిందట వివాహం అయ్యింది. కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం భార్య మూడవ నెల గర్భవతి. గురువారం ఉదయం డ్యూటీకి వెళ్లి వస్తానని ప్రసన్నకుమార్ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం ప్రసన్నకుమార్ ఇంటికి వస్తాడని ఎదురుచూస్తుండగా, అతని మరణ వార్త రావడంతో భార్య గుండెలవిసేలా రోదిస్తోంది.

అమ్మను ఒంటరిని చేసి..

షేక్ అబ్దుల్ గఫార్, మున్నికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. నాగుల్‌మీరా ఒక్కడే కుమారుడు. తండ్రి అబ్దుల్ గఫార్ పదిహేడేళ్ల కిందట మరణించడంతో తల్లీ కొడుకులిద్దరే ఉంటున్నారు. ప్రస్తుతం నాగుల్‌మీరా బేల్దారు పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. చేతికొచ్చిన కొడుకు అర్ధంతరంగా మరణించడంతో ఆ తల్లి ఒంటరి అయ్యింది. ఆమెకు అంతేలేని ఆవేదనను మిగిల్చింది. బిడ్డా నన్ను వదిలి వెళ్లావా.. అంటూ ఆ తల్లి రోదనలు చూపరులకు కంటతడిపెట్టించాయి.

రాగిజావ, చిక్కీ పంపిణీ వేళల్లో మార్పులు

ఉదయం 8:45కు బదులుగా 10:35 నుంచి పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా అందజేస్తున్న రాగిజావ, చిక్కీ పంపిణీ వేళల్లో మార్పులు చేస్తూ మిడ్ డే మీల్స్ డైరెక్టర్ నిధిమీనా ఉత్తర్వులు విడుదల చేసినట్లు డీఈవో పి.శైలజ శుక్రవారం తెలిపారు. ఈ నెల 21న ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన రాగిజావ పంపిణీ ప్రక్రియ వారంలో ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ఉదయం 8.45కల్లా అందజేయాలని ఇచ్చిన ఉత్తర్వులను సవరించినట్లు పేర్కొన్నారు. ఇక నుంచి ఫౌండేషన్ స్కూళ్లలో ఆయా రోజుల్లో ఉదయం 10.35కు, హైస్కూళ్లలో ఉదయం 10.45కు రాగిజావ పంపిణీ చేయాలని తెలిపారు. చిక్కీని మధ్యాహ్న భోజనం తరువాత విద్యార్థులకు అందజేయాలని డీఈవో శైలజ హెచ్‌ఎంలను ఆదేశించారు.

ఉర్దూ పాఠశాలల పనివేళల్లో మార్పులను అమలు చేయాలి..

రంజాన్ మాసం సందర్భంగా ఉర్దూ మీడియం పాఠశాలలు ఏప్రిల్ 22వ తేదీ వరకు ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు మాత్రమే పనిచేసేలా పర్యవేక్షించాలని డీఈఓ పి.శైలజ ఆదేశించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్



సత్తెనపల్లి: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. సత్తెనపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, రఘురాంనగర్‌లోని బీసీ బాలికల వసతి గృహాన్ని శుక్రవారం రాత్రి ఆయన సందర్శించారు. సిలబస్ ఎక్కడ వరకు పూర్తయింది, నోట్ పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎన్ రాజకుమారి, తహసీల్దార్ కె.నగేష్, మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తండాలో మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ శ్యాంప్రసాద్

- జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్
- కారెంపూడి తండాలో పర్యటన

కారెంపూడి: కారెంపూడిలో మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఆదేశించారు. గ్రామాభ్యుదయం ప్రోగ్రాంలో భాగంగా తండాలో శుక్రవారం తెల్లవారుజామున పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తండాలో 80 నివాస గృహాలుంటే అందులో సగం ఇళ్లకు మరుగుదొడ్లు లేవనే విషయాన్ని గుర్తించి అక్కడికక్కడే పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఫోన్‌లోనే ఆదేశాలిచ్చారు. ప్రభుత్వం రూ.12,500 సాయం అందిస్తుందని లబ్ధిదారులు ప్రతి ఇంటికి మరుగుదొడ్లు నిర్మించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని దర్శించి గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. రక్త హీనతతో బాధపడుతూ బరువు తక్కువగా ఉన్న పిల్లల వివరాలు అడిగి తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వృద్ధులను పలకరించి వారి ఆరోగ్య పరిస్థితిని వారు తింటున్న ఆహారం వారు చేస్తున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కల్తీలేని కెమికల్ రహిత ఆహారాన్ని అందరూ స్వీకరించాలని జేసీ సూచించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం గురించి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు గ్రామంలో పర్యటించారు. ఆయన వెంట తహసీల్దార్ జి.శ్రీనివాస్‌యాదవ్, ఎంపీడీఓ జి.శ్రీనివాస రెడ్డి, సర్పంచి తేజానాయక్, ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు షఫీ, ఎంపీటీసీ లింగయ్య ఉన్నారు.

రంజాన్ మాసం ప్రారంభం

- ఉపవాస దీక్షాధారులతో నిండిన మసీదులు
- గురువారం రాత్రి నుంచే తరావీహ్ నమాజులు



సుభాని నగర్‌లోని మస్జిదే ఎ సుభహానిలో జుమ్మ నమాజ్‌లో బయాన్ చేస్తున్న మౌలానా కలీమ్

యడ్లపాడు: పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షలు(రోజా) శుక్రవారం నుంచి ముస్లింలు ప్రారంభించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో గురువారం సాయంత్రం నెలవంక దర్శనం కావడంతో ముస్లింలు ఎంతో సంతోషంగా దువా చేసి దీక్షలు చేపట్టేందుకు సిద్ధం అయ్యారు. అదేరోజు రాత్రి రంజాన్ మాసానికే ప్రత్యేకమైన తరావీహ్ నమాజ్‌లను అన్ని మసీదుల్లో చదవడం ప్రారంభించారు. దీంతో రాత్రి 8.30 నుంచి 10.30 గంటల వరకు అన్నీ మసీదుల్లో మతపెద్దల బయాన్‌లు, తరావీహ్ నమాజ్‌లు కొనసాగాయి. ఏ మసీదులో చూసిన దీక్షలు చేపట్టే వారే కాకుండా అనారోగ్యం ఇతర కారణాలతో దీక్షలు చేపట్టిన వారు కూడా నూతన వస్త్రాలు ధరించి తరావీహ్ నమాజ్‌కు హాజరయ్యారు. రంజాన్ మాసం తొలిరోజున మసీదులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. నమాజ్ అనంతరం ఖర్జూరం, స్వీట్లను దాతలు మసీదుల్లో పంపిణీ చేస్తూ రంజాన్ మాసం ప్రారంభ శుభాకాంక్షలు తెలిపారు.

సుదినం.. పవిత్రమాసం రెండు ఒకేసారి

ముస్లింలు పండుగ రోజుగా భావించే శుక్రవారం నాడే పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం కావడంతో అంతటా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం ఉపవాస దీక్షలు ఆరంభించి మధ్యాహ్నం జుమ్మా (శుక్రవారం) ప్రత్యేక ప్రార్థనకు హాజరయ్యారు. పవిత్ర దినం, పవిత్ర మాసం ఒకేరోజు ప్రారంభం కావడం.. వాటియొక్క విశిష్టతలను మతపెద్దలు జుమ్మ బయాన్‌లో వివరించారు. రంజాన్ మాసంలో రోజా ఎంతముఖ్యమో చెడు పనులకు, చెడు ఆలోచనకులు దూరంగా ఉండటం అంతకంటే ముఖ్యమని బోధించారు.

ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తులు

సత్తెనపల్లి: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత -2023 అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి శుక్రవారం తెలిపారు. పారిశుద్ధ్యం, ఘన పదార్థాల నిర్వహణలో భాగంగా వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్న తరహా, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వ్యర్థాల శుద్ధికరణ, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడి చెత్త వినియోగం, వంటి అంశాలపై కృషి చేస్తున్న మహిళలు ఇందుకు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 27 లోగా సత్తెనపల్లి పురపాలక సంఘ పరిధిలోని వార్డు సచివాలయాలలో వార్డు శానిటేషన్ సెక్రటరీలకు దరఖాస్తులు అందజేయాలని కోరారు. అవార్డుకు ఎంపికైన మహిళలకు జూన్ 5వ తేదీన నిర్వహించనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో పురస్కారాలు అందజేస్తారని తెలిపారు. ఇతర వివరాలకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి 9849907932లో సంప్రదించాలని కోరారు.

ఆలయాల అభివృద్ధికి దాతలు రావడం అభినందనీయం



పూజల్లో పాల్గొన్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, దాత సింహాద్రి వెంకట రామారెడ్డి తదితరులు

కాజ(మంగళగిరి): ప్రాచీన ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని టీటీడీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కొనియాడారు. నగర పరిధిలోని కాజలోని కోదండ రామాలయం, అగస్త్వేశ్వర స్వామి ఆలయాల విమాన శిఖర ప్రతిష్టా మహోత్సవానికి శుక్రవారం ముఖ్య అతిథిగా విచ్చేసిన వైవీ సుబ్బారెడ్డి స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాచీన ఆలయాల జీర్ణోద్ధారణకు దాతలు సింహాద్రి వెంకట రామారెడ్డి దంపతులు పూనుకోవడం ప్రశంసనీయమన్నారు. ప్రాచీన ఆలయాల అభివృద్ధిలో భాగంగా టీటీడీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని మరిన్ని ఆలయాలను అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అందులో భాగంగా కాజ ఆలయాలకు తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి విమాన శిఖర ప్రతిష్ట, జీవ కళాన్యాసం, మహాకుంభాభిషేకం, పూర్ణాహుతి, శాంతి కల్యాణం నిర్వహించారు. పూజల్లో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, సింహాద్రి వెంకట రంగారెడ్డి దంపతులు, ఆర్ల రామయ్య, కమ్మెల సుబ్బారావు, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డిసరెడ్డి పాల్గొన్నారు. భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు.

నూతన అంశాలు వెలుగులోకి రావాలి

వీసీ ఆచార్య రాజశేఖర్



ఆచార్య శంకరావును సన్మానిస్తున్న వీసీ ఆచార్య పి రాజశేఖర్, పక్కన రెక్టార్ ఆచార్య పి వరప్రసాదమూర్తి

ఏఎన్‌యూ: తెలుగు భాషా విభాగం ఆధ్వర్యంలో పరిశోధనలు, సదస్సుల ద్వారా తెలుగు సాహిత్యం, కవులు, రచయితలకు సంబంధించిన నూతన అంశాలు వెలుగులోకి తేవాలని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తెలుగు, ప్రాచ్య భాషా విభాగం ఆధ్వర్యంలో 'అనిసెట్టి- పినిసెట్టి సాహిత్యం- సామాజిక దృక్కోణం' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును శుక్రవారం ప్రారంభించారు. వీసీ ప్రసంగిస్తూ తెలుగు సాహిత్యం ద్వారా సామాజికంగా ఎంతో మార్పుకు కృషి చేసిన అనిసెట్టి- పినిసెట్టిలకు సంబంధించిన అంశాలపై సదస్సు నిర్వహించడం వలన వారి భావజాలాన్ని సమాజానికి మరింత చేరువ చేసినట్లవుతుందన్నారు. వారి సాహిత్య విలువలపై ఈ సదస్సులో కూలంకుషంగా చర్చించాలన్నారు. ఏఎన్‌యూ రెక్టార్ పి.వరప్రసాద్ మూర్తి ప్రసంగిస్తూ సామాజిక అంశాలు, విలువల కోసం నిరంతరం కృషి చేసిన మహనీయులపై జాతీయస్థాయిలో చర్చ జరగడం అభినందనీయమని చెప్పారు. వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ స్వరూపరాణి మాట్లాడుతూ సమాజానికి వీరి నాటకాలు, సినిమాలు, వాటిలోని పాత్రల సృష్టి ద్వారా ఉన్నత విలువల్ని అనిసెట్టి సుబ్బారావు, పినిసెట్టి శ్రీరామమూర్తి సమాజానికి అందించారన్నారు. పినిసెట్టిపై కీలక ప్రసంగం చేసిన మద్రాస్ యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి విస్తాలి శంకరరావు మాట్లాడుతూ నాటి నాటక, సినీ రచనలు, వాటి పాత్ర చిత్రాల్లోనూ నైతికత ప్రధానంగా ఉండేదని వివరించారు. కానీ నేడు అది లోపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పినిసెట్టి ఆనాడే సమాజానికి మంచి విలువలతో కూడిన సాహిత్యాన్ని అందించారని అన్నారు. అనిసెట్టిపై పి.వి.సుబ్బారావు కీలక ఉపన్యాసం చేస్తూ నాటక, సినీ రచనల్లో ఎంతో వైవిధ్యం ఉందన్నారు. అనిసెట్టి కుమారుడు, విశ్రాంత ఆంగ్ల అధ్యాపకుడు శాంత కుమార్ ప్రసంగిస్తూ తన తండ్రిలో ఎంతో ఉన్నత విలువలు ఉన్నాయని అవి తాను స్వయంగా చూశానన్నారు. సదస్సులో డైరెక్టర్ ఆచార్య కృష్ణారావు, తెలుగు విభాగాధిపతి డాక్టర్ మాధవి ప్రసంగించారు.

జల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

సత్తెనపల్లి: జల సంరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. నీటి పరిరక్షణ అవగాహనపై గోడ పత్రికలను శుక్రవారం నరసరావుపేటలో ఆవిష్కరించారు. భారత ప్రభుత్వం, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర ఉమ్మడి గుంటూరు జిల్లా, జాతీయ జలశక్తి మిషన్, ఎడ్యుకేట్ ద సొసైటీ సంయుక్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ నీటిని వృథా చేయకూడదని, నీటిని మనం మాత్రమే వృథా చేయకూడదు అనే విధానాన్ని వీడి సమీపంలోని వారితో కూడా నీటి ప్రాముఖ్యతను వివరించి నీటి నిల్వలు పెంపొందించే విధంగా ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యంగా భావించాలని సూచించారు. క్యాచ్ ద రెయిన్ ప్రాజెక్ట్ ఫేస్ 3వ కార్యక్రమానికి విద్యార్థులు, యువజన సంఘాలు సహకారం అవసరమని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎడ్యుకేట్ ద సొసైటీ సంస్థ ప్రెసిడెంట్ షేక్ అన్సారీ ఉన్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధికి చేయూత

నాబార్డు డీడీఎం కార్తీక్



మహిళకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న నాబార్డు డీడీఎం కార్తీక్

శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులు అభ్యున్నతికి ప్రభుత్వ సహకారం అభినందనీయమని ఉమ్మడి గుంటూరు జిల్లా నాబార్డు డీడీఎం కేఆర్‌డీ కార్తీక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాబార్డు సౌజన్యంతో నేచురల్ హెల్త్ కేర్ సొసైటీ ఆధ్వర్యంలో జూట్ బ్యాగ్స్ తయారీపై శిక్షణ తీసుకున్న మహిళలకు ధ్రువీకరణ పత్రాలు శుక్రవారం పంపిణీ చేశారు. కార్తీక్ మాట్లాడుతూ జ్యూట్ బ్యాగ్‌లు తయారీలో నెల రోజుల పాటు ఉచితంగా మహిళ సభ్యులకు శిక్షణ ఇవ్వటంతో పాటు బ్యాంకు పరంగా రుణాలు మంజూరు చేయించి యూనిట్స్ ఏర్పాటు చేసేలా వారి అభ్యున్నతికి నాబార్డు అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాబార్డు తరపున శిక్షణ తరగతుల్లో పాల్గొన్న మహిళలకు నెలకు రూ.600 మంజూరు చేశామన్నారు. గ్రామీణ దుకాణ్ పథకంలో భాగంగా నాబార్డు నిధులతో రెండు సంవత్సరాల పాటు గది అద్దెలు, విద్యుత్ చెల్లింపులతో ఒక మహిళకు ఉపాధి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే వివిధ రంగాల్లో నైపుణ్యం సాధించిన మహిళలందరూ వారి వారి ఉత్పత్తులను మార్కెటింగ్ చేయటానికి దోహదపడుతుందన్నారు. నూజెండ్లలో నాబార్డు సహకారంతో ఎఫ్‌పీఓ ద్వారా పాల ఉత్పత్తిదారుల అభివృద్ధి పొందవచ్చునన్నారు. కూరగాయలు సాగు చేసే రైతులకు ప్రత్యేకంగా గిట్టుధర ఉండేలా వితంరాజుపల్లెలో మార్కెటు యార్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. రైతులు సాగు చేసిన కూరగాయలు మార్కెటింగ్‌తో పాటు నిల్వ ఉంచుకునే సదుపాయం‌ఉందన్నారు. మహిళలు తయారు చేసిన వన్నీ డిమార్టు ద్వారా అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహిళల్లో ఉండే నైపుణ్యాలను గుర్తించి వారి అభివృద్ధికి నాబార్డు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సీతారామయ్య, నాబార్డు ప్రతినిధి నేచురల్ హెల్త్ కేర్ సొసైటీ సభ్యులు నూకతోటి భగవాన్‌దాస్, సీసీలు రమాదేవి, బేబిరాణి, శిక్షణ బోధకురాలు జి.లక్ష్మీప్రభావతి పాల్గొన్నారు.

మిర్చి యార్డులో రూ.7 కోట్ల పనులకు ప్రతిపాదనలు


- వచ్చే ఏడాది మార్కెట్ ఫీజు లక్ష్యం రూ.100 కోట్లు
- మిర్చి యార్డు పాలకవర్గ సమావేశంలో చైర్మన్ సుధాకరరెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న యార్డు చైర్మన్ మద్దిరెడ్డి సుధాకరరెడ్డి, మేయర్ మనోహర్‌నాయుడు తదితరులు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో రూ.7 కోట్ల నూతన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు యార్డు చైర్మన్ మద్దిరెడ్డి సుధాకరరెడ్డి చెప్పారు. మిర్చి యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో మిర్చి యార్డు పాలకవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. అనంతరం సమావేశంలో చర్చించిన విషయాలను ఆయన మీడియాకు వివరించారు. మిర్చి యార్డును సుందరంగా తీర్చి దిద్దేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. యార్డును అన్ని రంగాలలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేస్తామని చెప్పారు. యార్డుకు వచ్చే మిర్చి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచి ధర లభించేలా చూస్తామని హామీ ఇచ్చారు. రైతులు, వ్యాపారులు, హమాలీలకు న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. ఏడాది మార్కెట్ ఫీజు గత ఏడాది కంటే భారీగా పెరిగిందని, గత ఏడాది రూ.63 కోట్ల మార్కెట్ ఫీజు వసూలు చేయగా, ఈ ఏడాది ఇప్పటికే రూ.87 కోట్లు వసూలు చేయడం జరిగిందని వివరించారు. ఈ నెల చివరికి రూ.90 కోట్లు వసూలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లు మార్కెట్ ఫీజు లక్ష్యంగా పాలకవర్గం, అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. అనంతరం చైర్మన్ మద్దిరెడ్డి సుధాకరరెడ్డిని ఎక్స్‌ఫిషియో సభ్యుని హోదాలో సమావేశానికి హాజరైన గుంటూరు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు సత్కరించారు. సమావేశంలో మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో వ్యక్తి మృతి



పిడుగు పడి మృతి చెందిన దేవేంద్ర

బొల్లాపల్లి: మిరప కోతకు వచ్చి పిడుగుపాటుకు గురై ఓ వలస కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని సరికొండపాలెం తండా సమీపంలోని పొలాల్లో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. కర్నూలు జిల్లా కొథాలయం మండలం వల్లూరు గ్రామం నుంచి సుమారు 35 కుటుంబాలు మిరప కోతలకు మండలంలోని సరికొండపాలెం తండా బతుకుతెరువుకు వలస వచ్చారు. అందులో వడ్డె దేవేంద్ర(33) కోతకు వెళ్లాడు. ఉరుములు మెరుపులతో పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య నిర్మల మరో కూలీ అక్కడే స్పృహ కోల్పోయారు. మృతుడికి భార్య, ఇరువురు చిన్నారులు ఉన్నారు.